క్లుప్తంగా

శ్రీనివాస్‌కు మాజీ మంత్రి పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత, పార్టీ నేతలు

దేవరపల్లి: దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్‌ను సోమవారం రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు తానేటి వనిత పరామర్శించారు. శ్రీనివాస్ తండ్రి సుబ్బారావు అనారోగ్య కారణంగా ఆదివారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి తానేటి వనిత సంగాయగూడెంలోని శ్రీనివాస్ స్వగృహానికి వెళ్లి పరామర్శించి, సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్లు గన్నమని జనార్దనరావు, నరహరిశెట్టి రాజేంద్రబాబు, మండల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు సాలి వేణు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీనివాస్, దోనెల్లి జానకీరామ్ తదితరులు శ్రీనివాస్‌ను పరామర్శించారు.

220 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మానవత మండల చైర్మన్ రాంబాబు

గోపాలపురం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి నిరుపేదలకు సేవలు అందించడం అభినందనీయమని మానవత మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. మండలంలోని రాజంపాలెంలో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు 220 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంబాబు మాట్లాడారు. స్థానికులు నందమూరి సత్యనారాయణ, గెడ భాస్కరరావు, మండల మానవత అధ్యక్షుడు రాపాక ఫణి కిషోర్, గెడ జోగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

‘కూటమి’ పాలనపై విసిగిపోయిన జనం

- సంక్షేమాన్ని గాలికి వదిలేసిన ప్రభుత్వం
- మాజీ హోం మంత్రి తానేటి వనిత



యర్నగూడెంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత తదితరులు



కొవ్వూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తలారి వెంకట్రావు, పార్టీ నాయకులు

దేవరపల్లి: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు విసిగిపోయారని రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ పాలన సాగిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అన్నిరంగాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జగనన్న ప్రభుత్వంలో మహిళా సాధికారితకు పెద్దపీట వేశారన్నారు. అప్పట్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. చంద్రబాబు ఏవిధంగా అసత్యాలు పలికి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారో తెలుపుతూ పార్టీ విడుదల చేసిన పుస్తకాలను నియోజకవర్గ స్థాయిలో ఆవిష్కరించనున్నట్టు ఆమె తెలిపారు. మండల స్థాయిలో కూడా పుస్తక ఆవిష్కరణ ఉంటుందన్నారు. గత జగనన్న ప్రభుత్వంలో అమలు జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి ఒక్కరూ మననం చేసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం తమను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని ప్రజలు దుయ్యబడుతున్నారని అన్నారు. ఏడాది పాలనలో చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రతి దానికి జగనన్నను, వైఎస్సార్ సీపీని టార్గెట్ చేసి కూటమి నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా వెన్నుపోటు పొడిచిందనేది పుస్తకంలో పొందుపర్చినట్టు వనిత తెలిపారు. కార్యక్రమంలో దేవరపల్లి, గోపాలపురం ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర ప్రచార విభాగం ఉపాధ్యక్షుడు కూసం రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సత్తి సాయిఈశ్వరరెడ్డి, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సాలి వేణు, ఏఎంసీ మాజీ చైర్మన్లు గన్నమని జనార్దనరావు, నరహరిశెట్టి రాజేంద్రబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల అధ్యక్షులు కూచిపూడి సతీష్, వెల్లంకి సుబ్రహ్మణ్యం, ప్రతాపనేని వాసుబాబు, ద్వారకాతిరుమల మండల మహిళా అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బంకా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి, సర్పంచ్ బొంతా భరత్‌బాబు, నాయకులు ముల్లంగి శ్రీనివాసరెడ్డి, కవల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కూటమి

తాళ్లపూడి(కొవ్వూరు): చంద్రబాబు అబద్ధపు హామీలతో మరో సారి ప్రజలను మోసం చేశారని, ఐదు కోట్ల ఆంధ్రులను వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆరోపించారు. కొవ్వూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని తలారి వెంకట్రావు, పార్టీ నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజలను పట్టించుకోవడంలేదని, పైగా మోసం చేస్తోందన్నారు. ప్రజలు ఇదంతా అర్థం చేసుకుని రాబోయే రోజుల్లో జగన్‌కు మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్ బాబు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, పట్టణ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, చాగల్లు మండల కన్వీనర్ మట్టా వెంకట్రావు, రాష్ట్ర ఎస్సీసెల్‌కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, నాయకులు వల్లభశెట్టి శ్రీనివాస్, చిక్కాల మహేష్, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, మెండి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ

నిడదవోలు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ విమర్శించారు. నిడదవోలులోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబంటే మోసం పుస్తకాన్ని పార్టీ శ్రేణులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. వైఎస్ జగన్ పాలనలో ప్రతి ఏడాది సంక్షేమ క్యాలెండర్ పక్కాగా అమలు చేసి రాష్ట్రాన్ని సంక్షేమాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దారన్నారు. పెరవలి మండల ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో సంపద సృష్టి లేదని, అప్పులకు అడ్రస్‌గా చంద్రబాబు మార్చారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం నిర్వీర్యమయ్యాయన్నారు. జగన్ ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి పేదల వైద్యానికి, ఆరోగ్యానికి పెద్దపీట వేశారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు కేసులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని విమర్శించారు. నిడదవోలు మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వైఎస్ జగన్ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మేనిఫెస్టో ఒక పవిత్ర గ్రంథంగా జగన్ అమలు చేసి పేదల బతుకులు మార్చారన్నారు. చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాల ఎగనామానికి సాకులు వెతుకుతూ కాలం గడిపేస్తున్నారన్నారు. అనంతరం జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబంటే మోసం అని పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు, కౌన్సిలర్ దాకే అనిల్‌కుమార్, నాయకులు వీరమల్లు సత్యనారాయణ, యాళ్ల రామారావు షేక్ ఖాన్‌భాషా, ఆలమూరి రాజా, మొదలవలస నాని, భీమవరపు నాగేంద్ర, కొమ్మిశెట్టి సాయి, సన్నీ, కె.భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.



జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

భవన నిర్మాణ కార్మికుల ధర్నా



నిడదవోలులో ధర్నా చేస్తున్న కార్మికులు

నిడదవోలు: కూటమి ఏడాది పాలనలో కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీస్మకుమార్ విమర్శించారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిడదవోలు కార్మికశాఖ కార్యాలయం వద్ద సోమవారం భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికులకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా నాయకులు పామర్తి సత్యనారాయణ, ఖండవల్లి వీరవెంకట్రావు, అభ్యుదయ పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆర్.సురేష్‌కుమార్, నాయకులు ఉన్నమట్ల సురేష్, నూతంగి రమేష్, మల్లిపూడి రామచంద్రరావు, పిచ్చా సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు

పాఠశాలలో యోగా మాక్ డ్రిల్



వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద యోగా మాక్ డ్రిల్ కార్యక్రమం

తాళ్లపూడి: వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద తహసీల్దార్ లక్ష్మి లావణ్య ఆధ్వర్యంలో సోమవారం యోగా మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోహనభారతి ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు వివిధ ఆసనాలు వేశారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రామ చెల్లయ్య, లక్ష్మణ్ కుమార్‌లు విద్యార్థులు, సచివాలయ సిబ్బందితో యోగా చేయించారు.

నారాయణ పాఠశాలలో యూనిఫాం సీజ్



నిడదవోలు నారాయణ స్కూల్‌లో యూనిఫాం ఉన్న గదికి తాళం వేస్తున్న ఎంఈఓ గురుమూర్తి

నిడదవోలు: పట్టణంలోని నారాయణ స్కూల్‌లో అనుమతులకు విరుద్ధంగా యూనిఫాం అమ్ముతున్నట్టు ఎంఈఓ పి.గురుమూర్తి సోమవారం తెలిపారు. ఎస్ఎఫ్ఐ సభ్యుల ఫిర్యాదుపై పాఠశాలలో తనిఖీలో నిర్వహించి రూ.1.50 లక్షల విలువైన యూనిఫాంను సీజ్ చేసి, ఆ గదికి తాళం వేసినట్టు ఆయన చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయాలు జరిపితే సంబంధిత ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని గురుమూర్తి హెచ్చరించారు.

పాఠశాలలో వెల్కమ్ బ్యాక్ టు స్కూల్ కార్యక్రమం



కొవ్వూరులో ఎస్ఆర్‌కే ఫస్ట్ డే స్కూల్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు తల్లిదండ్రులు

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరు పట్టణంలోని డాక్టర్ ఎస్ఆర్‌కే నెక్స్ట్ జెన్ స్కూల్‌లోలక్షవెల్కమ్ బ్యాక్ టు స్కూల్ అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థుల వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఆశీర్వదించి, తరగతి గదులకు పంపించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, డైరెక్టర్ ఏ రష్మిత, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

92 మందికి కంటి వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: స్థానిక మైత్రేయ బుద్ధ విహార, బౌద్ధధమ్మ పీఠంలో బౌద్ధ పీఠాధిపతి బంతె అనాలియో ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగనంద కంటి ఆసుపత్రి వైద్యులు సుమారు 92 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 32 మందికి కళ్లజోళ్లు, 28 మందికి ఆపరేషన్లుకు రిఫర్ చేశారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

సారా విక్రేత అరెస్టు

దేవరపల్లి: కృష్ణంపాలెంలో సారా విక్రయిస్తున్న కడలి శ్రీనివాస్‌ను సోమవారం అరెస్టు చేసినట్టు దేవరపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. నింధితుడి నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

మండల వ్యవసాయ అధికారిగా రాజారావు



ఉండ్రాజవరం: మండల వ్యవసాయాధికారిగా బి.రాజారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాజారావు గతంలో గోపాలపురం మండల వ్యవసాయాధికారిగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఉండ్రాజవరం మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు సంబంధించిన పథకాలు అమలు చేయడంలో తన వంతు కృషి చేస్తానన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముందుగా పసలపూడి, సూర్యారావు పాలెం గ్రామాల్లో మంగళవారం ఈకార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ నిలిపివేత

పెరవలి: మల్లేశ్వరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం నుంచి 19వ తేదీ వరకూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎలక్ట్రికల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. మల్లేశ్వరం, కడింపాడు గ్రామాలకు ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నామని దీనిని వినియోగదారులు గమనించాలన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

దేవరపల్లి: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పల్లంట్లలో అగ్రికల్చర్ బైపర్‌కేషన్ నిమిత్తం నూతన ఫీడర్ ఏర్పాటు, 11 కేవీ స్తంభాల నిర్మాణ పనులు జరుగుతున్నందున బుధవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎన్. నారాయణ అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

పాఠశాలలో పలువురికి సత్కారం



పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను సత్కరిస్తున్న సర్పంచ్ వెంకట్రావు తదితరులు

తాళ్లపూడి: పెద్దేవంలోని జీఎస్ రావు జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద సోమవారం బదిలీపై వెళుతున్న తెలుగు టీచర్ జామి సత్యనారాయణ, డ్రిల్ మాస్టర్ జె.నాగమోహన్‌రావులను, పదో తరగతి ఫలితాల్లో మండలంలో రెండో స్థానం వచ్చిన సాత్విక్ హర్ష, తన తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, సురేష్‌లను సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో సన్మానించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ నాగేంద్ర, మండల కాపు సంఘం అధ్యక్షుడు నామ ప్రకాశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు ప్రాధాన్యం కల్పించాలి

నిడదవోలు: సమాజంలో వృద్ధులకు ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్ల ఫోరం మండల శాఖ అధ్యక్షుడు అడపా సూర్యచంద్రరావు అన్నారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో సీనియర్ సిటిజన్ల ఫోరం ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ బి.నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ల ఫోరం గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి కీర్తి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, సభ్యులు ఎం.చిట్టిబాబు, కేఎస్‌వీపీ కుమార్, ఖండవల్లి రంగాచార్యులు, పి.రామ్మూర్తి, డి.సూర్యచంద్రరావు, పెద కృష్ణయ్య, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పెండ్యాల ఆయకట్టుకు సాగునీటి విడుదల

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వరం వద్ద పెండ్యాల పంపింగ్ స్కీమ్ ఆయకట్టుకు సోమవారం సాగునీరు విడుదల చేశారు. నిడదవోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ జి.సూర్యభాస్కరరావు మోటార్ స్విచ్ వేసి నీటిని విడుదల చేశారు. ఆయకట్టు పరిధిలో 6,646 ఎకరాలకు నీరు అందిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో నిడదవోలు డీసీ అధ్యక్షుడు సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.